# కర్ణుడిచావు

కర్ణుడు చచ్చిపోయేడు.

కర్ణుడంటే భారత కర్ణుడు కాదు. కర్ణుడంటే కన్నుడు. పూర్తిపేరు కన్నారావు. పదహారేళ్లు నిండని పసిప్రాయం. తెలిసీ తెలియని లోకం. విరిసీ విరియని నునులేతమొగ్గ.

కన్నుడూ! అనేది అమ్మ. కన్నా అని పిలుచుకునేవాడు తండ్రి. తోటి వాళ్లకి మాత్రం కన్నారావ్, ఏడోతరగతి బి సెక్షన్. స్కూల్లో తెలుగుటీచరు కన్నుణ్ని ముద్దుగా 'ఒరేయ్ కర్ణుడూ!' అని పిలిచేవాడు. చివరికదే స్థిరపడిపోయింది.

భారత కర్ణుడి చావుకి ఆరుగురు కారణం.

మరి, యీ కర్ణుడి చావుకి కారణం ఎవరు?

కర్ణుడు చచ్చిపోయేడు- చావంటే అలాగా యిలాగా కాదు.

లోహచక్రాల పదఘట్టనల కింద శరీరం నుగ్గునుగ్గుగా చెయ్యీకాలూ మొండెం దేనికది తెగిపడిపోయి వ్యవస్థని నిలబెట్టి ప్రశ్నిస్తున్నట్టు నిస్తేజమై నిలచిన కళ్లతో.

ఎందుకు చేసేవు కన్నా యీ దుస్సాహసం? ఏ కష్టం కుదిపేసింది తండ్రీ నిన్ను?!

* * *

ఒకటి

ఉస్సురని ఆపసోపాలు పడుతూ సైకిలుదిగి స్టాండువేసి యింట్లోకి వస్తూనే పడక కుర్చీలో కూలబడ్డాడు రవి- కర్ణుడి తండ్రి.

''ఏమండీ. కన్నని స్కూల్లో జాయిను చేసేసేరా?'' చేతులు కొంగుకి తుడుచుకుంటూ వచ్చి అడిగిందతని భార్య.

ఆహాఁ!

ఎలాగయితేనేం ఆ పని పూర్తయింది. పేరుకి ప్రభుత్వ పాఠశాలే కాని, గవర్నమెంటు ఉద్యోగస్తుల పిల్లలకి సీట్లు దొరకడం కూడా పెను ప్రళయమైపోతోంది. ఏం రద్దీ! ఏష్టి రద్దీ! తాతలు దిగొచ్చారనుకో''

''పోనీలెండి. సీటు దొరికింది కదా.. డొనేషన్లూ, ఫీజులూ అవీకట్టి ప్రైవేటు స్కూళ్లలోనూ, కాన్వెంట్లతోనూ చేర్పగలిగే స్తోమత మనకెలాగూలేదు.''

[illegible] ఎప్పుడూ. "[illegible] ఉద్యోగం [illegible]
వాడు ఎప్పుడయినా బాగుపడలాడు. వాడికా ఉండాలి పుండాలి. మనకా అదృష్టం ఏడవాలి. మేమంతా గవర్నమెంటు స్కూళ్లలోనే చదివి పైకిరాలేమా!"

భార్య కాదనలేదు.. కాదంటే తాలూకా ఆఫీసులో గుమస్తాగాచేరి, గుమస్తాగానే పాతుకుపోయిన భర్త ప్రయోజకత్వాన్నే ప్రశ్నించినట్లవుతుందిమరి.

"వాడికి పుస్తకాలూ అవీ కొనిపడేసి, ఓ మంచి ప్రైవేటు ట్యూషను కుదిర్చి పెట్టేసరి- వాడి చదువు గురించి బెంగతీరిపోతుందింక"

"అవునవును...." తలూపింది భార్య.

మర్నాడే కొడుక్కి కావలసిన పుస్తకాలు కొన్నాడు. ఓ ట్యూషను కుదిర్చేడు. 'బాగా చదవాలిరా!' అని హెచ్చరించేడు. బుద్ధిగా తలూపేడు కర్ణుడు.

అంతే, ఆ తర్వాత వాడి చదువుసంధ్యల గురించి పట్టించుకునే ఓపికా, తీరికా లేకపోయేయి కన్నతండ్రికి. స్కూల్లో చేర్చడంతోనే తన బాధ్యత తీరిపోయినట్టుగా హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు రవి. అటు భార్యకి ఎంతసేపూ యింటి పనితోనూ, చంటిపిల్ల సంరక్షణతోనూ తీరదుపాపం.

కర్ణుడి చదువుకి పదోతరగతి వరకూ మరింక ఢోకా లేదు!

* * *

రెండు

నిజమే! ఆరోతరగతిలో పాఠశాలలో ప్రవేశించిన కర్ణుడికి పదోతరగతి వరకూ ఎదురులేకపోయింది. పరీక్ష తప్పడమంటే వాడికి తెలీదు. స్కూల్లో వాడి దృష్టి అంతా అటెండెన్సు మీదే ఉండేది. వాడికి తెలుసు ఎక్కువ అబ్సెంట్లు ఉంటే మాత్రమే తరగతిలో ఉంచేస్తారు. యూనిట్ పరీక్షల్లోనూ, టెర్మినల్ పరీక్షల్లోనూ సున్నాలొచ్చినా ఫరవాలేదు.

స్కూల్లో మొదటి పీరియడ్ ఇంగ్లీషు మాష్టరు వచ్చి పిల్లల అటెండెన్సు తీసుకునేవాడు. ఆ సమయంలో హాజరు దాదాపు నూరుశాతం. పిల్లలు శ్రద్ధగా ప్రజెంటు పలికేవారు. పాఠంకన్నా హాజరు వేయించుకోవడమే ముఖ్యమన్న సంగతి వాళ్లెప్పుడో తెలిసిపోయింది. పరీక్షల్లో తక్కువ మార్కులొస్తే మహా అయితే క్లాసులో తిడతారు. అంతేకాని- తమని పరీక్ష ఫెయిల్‌చేసి అదే తరగతిలో వుంచేసే హక్కు వాళ్లకి లేదుగా! మరందుచేత ఆ స్కూల్లో పిల్లలు అటెండెన్సుకి యిచ్చే ప్రాధాన్యత మరి దేనికీ యివ్వడం మానేసి చాలా యేళ్లయింది.

వర్ధిల్లు! విద్యావిధానమా, వర్ధిల్లు!!

మన కథానాయకుడు కర్ణుడు కూడా ఈ విషయంలో చాలా జాగ్రత్తపడేవాడు. సర్వసాధారణంగా ఆబ్సెంటయేవాడు కాదు. హాజరు పలకడం పూర్తయేక రెండో పీరియడులోనో, ఇంటర్వెల్ తర్వాతో తనలాంటి మరో పది, పదిహేను మంది కుర్రాళ్లతో చక్కగా స్కూలునుంచి బయటికి జారుకునేవాడు.

ఎక్కడెక్కడో తిరిగి స్కూలు వదిలే సమయానికి బుద్ధిగా యిల్లు చేరేవాడు.

హాజరు వేయించుకోగానే కొంతమంది పిల్లలు యిలా జారుకోవడం మేష్టర్లు ఎందుకు పట్టించుకునేవాళ్ళు కారో వాళ్ళకి అర్థమయేదికాదు. ఏమయితేనేంగాక యిదే బాగుంది. సరైన అటెండెన్సుంటే ప్రతియేడాా పై తరగతిలోకి ప్రమోషన్.

ఎంతచక్కని సదుపాయం తండ్రీయిది-

అటెండన్సు పడగానే పిల్లల గైరుహాజరుపట్ల టీచర్ల ఉదాసీనతకు కూడా కచ్చితమైన కారణం లేకపోలేదు.

* * *

మూడు

స్కూల్లో ఆరోతరగతిలో చేరిన మొదటిరోజే కర్ణుడికి స్కూలంటే హడలు పుట్టుకొచ్చింది. ఆ జనప్రవాహం చూసి వాడు బెంబేలెత్తిపోయేడు. పడిపోతూ శిథిలావస్థలో కొచ్చిన తరగతి గదులు. పెచ్చులూడి పోతున్న గచ్చులు. ఒక తరగతిలోనూ బెంచీలు లేవు. అంతా గలీజుగా ఉంది. నేలమీదే కూచోవడం, ఒక్కో క్లాసులోనూ డెబ్బయ్ మంది పైచిలుకు పిల్లలు- చదువుకోడానికి కాకుండా క్రిక్కిరిసిన సినిమాహాల్లో నేలక్లాసు జనంలాగ! అంతా తొడతొక్కిడిగా ఉంది.

తనెక్కడ కూచోవాలో ఓ క్షణం అర్థం కాలేదు. కర్ణుడికి. జారిపోతున్న నిక్కరు మీదకు లాక్కుంటూ మెల్లగా పిల్లల్ని దాటుకుంటూ వెళ్ళబోయేడు. పొరపాటున ఎవరి కాలు తొక్కేసేడో ఓ చెయ్యి లాఘవంగా వాడి నిక్కర్లోకొచ్చి గట్టిగా ఓ తొడపాయసం పెట్టింది.

'కెవ్' మని అరిచేడు కర్ణుడు.

''ఏయ్, ఏమయింది?'' గర్జించాడు లెక్కల టీచరు. ఎవరూ సమాధానం చెప్పలేదు. టీచరు శివాలెత్తిపోయేడు.

''సైలెన్స్. సరిగా కూచోండి - వెధవ చదువులు ఒక్కో క్లాసుకీ డెబ్బయ్‌మంది పిల్లలయితే ఎలా ఏడవాలి? పేరుకి మాత్రం ఒక్కో ఉపాధ్యాయుడికీ ముప్పయ్యేసి మంది విద్యార్థులుండాలని నిబంధనలు. చూడబోతే ప్రభుత్వ పాఠశాలలు కనుక ఎవర్నీ అడ్మిట్ చేసుకోం అనడానికి వీల్లేదు. పుష్పకవిమానం. ఇంతమందిని కంట్రోల్ చెయ్యడవే కష్టం. ఇక పాఠాలేం చెబుతాం నాబొంద'' అనుకుంటూ విసుక్కున్నాడు.

అటెండెన్సు పూర్తయ్యాక ఎంతమంది జారుకుంటే టీచర్ల ప్రాణానికంత హాయిగా వుంటుంది. ఓ నల్ల బల్ల వుండదు. ఓ సుద్దముక్క వుండదు. కూచోడానికి కుర్చీ వుండదు. చూపించడానికి ఓ పరికరం వుండదు.

అందుచేత మేష్టర్లంతా 'బిల్లు-బెల్లు' సిద్ధాంతానికి కట్టుబడిపోయేరు. సకాలంలో జీతం బిల్లులు చేసుకోవడం ఠంచనుగా బెల్లులు కొట్టిస్తూ ఆ పూటకి స్కూలు అయిందనిపించడం.

విద్యావిధానంలో తమ అనాసక్తతకి మేష్టర్లు చూపే కారణాల తోరణాలకిది బొమ్మ-

ఇక బోనుసు పేచు-

అన్ని ప్రభుత్వ రంగశాఖలలోలాగే పెరిగిపోయిన అలసత్వం. పనిచేసినా చేయకపోయినా జీతం వొచ్చిపడుతుందనే భరోసా. ఎప్పుడో యేడాదికోసారి మొక్కుబడిగా విద్యాశాఖాధికారులు వచ్చేటప్పుడు తప్ప- మరెప్పుడూ తమకి ఎదురు లేదన్న ధీమా. ఇళ్లదగ్గర ట్యూషన్లు చెప్పుకుని లబ్ధిపొందడంలో అలవాటయిన స్వార్థం.

రోగి కోరిందీ వైద్యుడు చెప్పిందీ ఒకే పథ్యం అన్నట్లు టీచర్ల యీ రకమయిన వైఖరి కర్ణుడు లాంటి వారికి ఓవరంలా పరిణమించింది. అది వరం కాదనీ, వారి పాలిట కాలకూటవిషమనీ ఎవరు చెప్తారు వాళ్ళకి? ఎవరు దీనికి జవాబుదారు?

* * *

నాలుగు

ఏం చదివాడో, ఏ చదవలేదో తెలీకుండానే పెనుగాలులకి కొట్టుకొచ్చిన వాడిలా కర్ణుడు పదో తరగతిలోకి వచ్చిపడ్డాడు.

అప్పుడు మొదటిసారిగా వాడిలో భయం మొదలయింది. మొట్టమొదటిసారిగా పబ్లిక్ పరీక్షలు రాయాల్సి ఉంటుందని తెలియగానే వాడి బుర్ర పనిచెయ్యడం మానేసింది. దానికితోడు అంతవరకూ తననీ తన చదువునీ పట్టించుకోని తల్లిదండ్రులు ఒక్కసారిగా పూనకం వచ్చిన వాళ్లలా తనమీద విరుచుకుపడిపోతూ వుండటం వాడికి దిగ్భ్రాంతి కలిగించింది. అమ్మానాన్నల సతాయింపు ఎక్కువయింది. ఓ పక్క స్కూల్లో చెప్పేవేవీ తలకెక్కని స్థితి ఏమైనా సరే పదోతరగతి పరీక్ష గట్టెక్కి తీరాలని నిర్ణయానికొచ్చేడు కర్ణుడు. బాగా చదవాలని నిర్ణయానికొచ్చేడు. స్కూలుకీ ట్యూషన్లకీ బుద్ధిగా హాజరవడం మొదలుపెట్టాడు.

కర్ణుడి బుద్ధి కుదురుకునేసరికి స్కూల్లో టీచర్లకి ఎడాపెడా బదిలీలు జరిగిపోయేయి. మేష్టర్ల బదిలీలతోటే తమసత్తా చూపించుకునే రాజకీయ నాయకులూ, అధికార్లు విజృంభించేరు. మూకుమ్మడి టీచర్ల బదిలీలు. కొత్తవాళ్లు ఒకరూ యిద్దరూ బదిలీమీద వచ్చి జాయినయ్యేరు. అంతే స్కూల్లో సైన్సుటీచరు పోస్టు, హిందీ పోస్టు ఖాళీగా ఉండిపోయేయి. నామమాత్రంగానే అయినా, తక్కిన సబ్జెక్టులలో బోధన జరుగుతోంది కాని- సైన్సు, హిందీ ఒక్క పాఠం కాలేదు. పట్టించుకునే నాథుడూ లేడు.

టీచర్ల కొరత, ఆ కత్తివాదరకి ఎంతమంది పిల్లలు గురికాబోతున్నారో? ఏ ప్రభుతకి వినిపిస్తుందీ ఆర్తి?

చాలా రోజులకి కళ్ళుతెరచి, సైన్సు పాఠంలోని ప్రశ్నలడిగేడు తండ్రి, కర్ణుడు నీళ్ళు నమిలేడు. వీరావేశంతో కొడుకుని, కుళ్లబొడిచి ప్రాణాలు ఆర్పుకుపోయేలా కొట్టేడు. కర్ణుడు వెక్కి వెక్కి ఏడ్చాడు.

అవి- వ్యవస్థ కొట్టిన దెబ్బలు

* * *

అయిదు

పబ్లిక్ పరీక్షలు మరో నాలుగు నెలలున్నాయనగా. ఏటా ఆ ప్రాణం మీదకి. యింటికి చుట్టాలొచ్చేరు. బంధువులొచ్చేరంటే ఎంత సంబరంగా ఉండేదో! అలాంటిది యీసారి చుట్టాలు రావడం కర్ణుడికి ప్రాణసంకటంగా తయారైంది.

కారణం చుట్టాలబ్బాయి ఆనంద్- మంచిపట్నంలో మంచి స్కూల్లో పదోతరగతి చదువుతున్నాడు- ఏదో పెళ్ళికి వెళ్ళివస్తూ ఓ పూట అక్కడ దిగేరువాళ్ళు.

కర్ణుడి తండ్రిలాంటి వాళ్ళకి ఊహించడానికే భయం వేసేంత పెద్ద మొత్తంలో ఫీజులు కడుతూ, ఓ మంచి ప్రైవేటు కాన్వెంటులో చదువుతున్నాడు ఆనంద్. వాడి తెలివి, భాష ఎంతో ముచ్చటగా ఉన్నాయి. ఆనంద్‌కీ కర్ణుడికీ తేడా చూస్తేనే తెలిసిపోతోంది. ఆనంద్ గడగడ ఇంగ్లీష్‌లో మాట్లాడేస్తూ ఏ సబ్జెక్టులోనయినా అడిగిందే తడవుగా జవాబులు చెప్తూ ఉంటే- కర్ణుడి తల్లిదండ్రులకి మతిపోయింది. బంధువులు వెళ్ళిపోయిన ఆక్షణం నుంచీ సలాయింపులు మరీ ఎక్కువయేయి. ''దరిద్రుడా! నీకేం లోటుచేశామని యిలా తయారయ్యావు? పుస్తకాలు కొనివ్వలేదా? ట్యూషన్లు చెప్పించలేదా? ఆనంద్ చూడు ఎంతచక్కగా చదువుకొని పైకొస్తున్నాడో. నువ్వూ ఉన్నావ్ ఎందుకూ'' అంటూ దులపరించేసేరు.

ఆనంద్‌కీ తనకీ అంత అంతరం ఎందుకొచ్చిందో కర్ణుడికి తలచించుకున్నా అర్థం కాలేదు. అర్థం కాదు కూడా! ఎందుకంటే-

పందుల పాకల పక్కనే భవ్యహర్మ్యాలూ, విందు భోజనాల సందడి పక్కనే ఆకలిచావులూ, అసంఖ్యాక సౌకర్యాల పక్కనే అంతులేని అసౌకర్యాలూ, వినోదాల పడగనీడల్లోనే అనంత విషాదాలూ-

ఇన్ని ద్వంద్వాల మధ్య నిర్లజ్జగా మనుగడసాగించే వ్యవస్థలో అందరికీ అన్నీ దొరకవని వాడి చిన్ని మెదడుకి ఎలా తడుతుంది ?

* * *

ఆరు

పరీక్షలు పెనుభూతంలా వచ్చి మీద పడ్డాయి. భయాల సుడిగుండంలో మునిగిపోతున్న కర్ణుడికి ఆసరాగా ఓ గడ్డిపోచ దొరికింది.

అది నిజంగా గడ్డిపరకే! దానిపేరు వర్ధనరావు. పరీక్షల ముందు వర్ధనరావు కర్ణుడి తండ్రిని కలసి ఏవో మంతనాలు సాగించేడు.

పబ్లిక్ పరీక్షల నిర్వహణకి వచ్చే డీవోలనూ, ఇన్విజిలేటర్లనూ 'మందు'లో ముంచెయ్యొచ్చన్నాడు. డబ్బుతో కొనెయ్యొచ్చని నూరిపోశాడు, నిరాటంకంగా స్లిప్పులు తీసికెళ్ళి కాపీ చేయొచ్చని ప్రూవించేడు. ప్రతిచోటా జరిగేదీ, మంచిమార్కులతో పాసవుతున్న పిల్లల కథాకమామీషు యిదే సుమా అన్నాడు.

సరిగ్గానే గాలానికి తగిలింది చేప.

కర్ణుడి తండ్రి వర్ధనరావు చేతిలో వెయ్యిరూపాయలు పోసి నిశ్చింతగా నిట్టూర్చేడు. కొడుకు

[illegible] ఎంతో సంతోషించేడు. కిష్టుడి ఆనందానికి పట్టపగ్గాలు లేకుండాపోయేయి.

మొదటి పరీక్ష చాలా ఉత్సాహంతో బాగా రాసేడు కిష్టుడు.

చదువంటే ఇంత సులభమా! అని మొదటిసారిగా తెలిసి ఉప్పొంగిపోయేడు.

మర్నాడు రెట్టించిన ఉత్సాహంతో మరిన్ని ఎక్కువ ప్రశ్నలు పరీక్షహాలుకి పట్టుకెళ్లాడు.

అప్పుడు జరిగింది - వాడు కలలో కూడా ఊహించని ఆ సంఘటన!

తెచ్చుకున్న చిట్టీలోంచి కాపీ చేస్తుండగా కిష్టుడి భుజంమీదపడింది బలమైన చేతిదెబ్బ. బిత్తరపోయి చూసేడు. కళ్లముందు చీకటి ఆవరించింది. శరీరంలో అణువణువు భయంతో వణికిపోయింది. చెమటతో ఒళ్లుతడిసి ముద్దయింది.

ఏం జరిగిందో గ్రహింపు చేసుకునే లోపల పరీక్ష నుండి డిబారై హాలుబయటికి నడవాల్సి వచ్చింది.

కిష్టుడి ప్రపంచం బద్దలైంది.

లోహచక్రాల పదఘట్టనల కింద వాడి శరీరం నుగ్గునుగ్గుగా.. ఖండతుండేలుగా..

కన్నా! కన్నా! కన్నా!!!

(ఈనాడు. ఆదివారం. 24.6.1990)